# అంతఃచేతనలోని సూక్ష్మఆలోచనే  మూలమాయ NEWS LETTER (1) 25.08.26

శ్రీగురుధాంధర్మక్షేత్రం, బలుసుపాడు, జగ్గయ్యపేట మం. ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ 9848306655




మనం ఉనికి (ఆత్మ), ఉపాధి (దేహం) ఉన్నది (ప్రపంచం)ల సమ్మేళనంగా ఉన్నాం. ఉనికి ఉపాధితో కలిసి మనసుగా ఏర్పడిన తరువాత వచ్చే ఆలోచనలు దైహిక మానసిక ఆంతరంగిక ఆలోచనలు గా మూడు స్థాయిలో ఉంటాయి. విచారణ ద్వారా కలిగే అవగాహన మనసులోని ఈ మూడు స్థాయిల ఆలోచనలను తేట తెల్లం చేసి సహజ ధ్యానాన్ని, ఆత్మ జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. ఉనికి ఉపాధితో కలిసి మనసుగా ఏర్పడి తాను కావాలనుకున్నది పొందే ప్రయత్నమే ఆలోచనగా ఉంటుంది. జీవనం కోసం అవసరమైన వాటికి చేసే ప్రయత్నాలు భౌతిక ఆలోచనలుగా ఉంటాయి. మన నుండి మనం మానసికంగా కోరుకునే అనుభూతి అనుభవాల కోసం చేసే ప్రయత్నం మానసిక ఆలోచనలుగా ఉంటాయి. ఆధ్యాత్మిక జీవనంలో చేసే ధ్యానం యోగం విచారణ వంటి సాధనల వల్ల మనసుకు నిశిత దృష్టి ఏర్పడి మనసు యొక్క స్వరూపాన్ని అంటే ఆలోచనల యొక్క సమగ్ర స్వరూపాన్ని మనకు అవగాహన లోకి తెస్తుంది. ఇందులో భాగంగానే తొలిగా భౌతికంగా జీవనం కోసం చేసేవన్నీ దహికమైన ఆలోచనలే అన్న పొరను అది తెలుసుకుంటుంది. సాధనలో అవగాహన పెరిగే కొద్దీ తన నుండి తాను కోరుకునే ధ్యానం జపం పూజ యోగ స్థితులు కూడా సూక్ష్మమైన ఆలోచనలో బాగాలేనని అవగతం చేసుకుంటుంది. ఈ స్థాయిలో జ్ఞానులు బోధించిన ఎరుకకు మనసుకు ఉన్న వ్యత్యాసం స్పష్టంగా అవగతం అవుతుంది. కానీ ఆ స్థాయిలో కూడా తాను ఎరుకగా ఉండాలి ఎరుకను తెలుసుకోవాలి ఎరుకగా మిగిలిపోవాలి అని ఆకాంక్షించే ఒక ఆంతరంగిక ఆలోచన మిగిలే ఉంటుంది. గురువు అనుగ్రహంతో కలిగే  అవగాహనలో నిశిత దృష్టితో ఉన్న మనసు.... ఈ చివరి ఆలోచనను మూల మాయ అని అర్థం చేసుకుంటుంది.  మనసు యొక్క ఈ సూక్ష్మ ఆకాంక్షను తెలుసుకున్న ఎరుక సహజ ధ్యానంగా మిగిలిపోతుంది. సాధనను సంపూర్ణం చేసే ఈ అంతిమ అవగాహనలో మనసు యొక్క పుట్టుక మొదలు ఆలోచనల పరంపర సంపూర్ణంగా తెలుస్తుంది. అప్పుడు జీవితం అంతా విస్తరించిన నేను అన్న అహంభావం నేనున్నాను అన్న తొలి భాగంగా ఎలా మూల మాయగా ఉందో ఎరుకకు అవగాతం అవుతుంది. నిద్రలో ఈ నేను తెలియకుండా పోతుందని సాధన ద్వారా తెలిసిపోతుందని "తెలిసి"...పోతుందని.... అవగాహన ఏర్పడుతుంది. అదే జ్ఞానుల సహజ ధ్యానస్థితి